AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

23-10-2025 (Thursday) | MAIN EDITION

## ఆర్‌ఆర్‌బీ నుంచి భారీ నోటిఫికేషన్





**అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్:** ఉద్యోగావకాశాల కోసం ఎదురు చూస్తున్న వారికి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ శుభవార్త తెలిపింది. నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీ (ఎన్‌టీపీసీ)లో వివిధ విభాగాల్లో 5,810 పోస్టుల భర్తీ కోసం భారీ నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నవంబర్ 20 వరకు సమర్పించవచ్చు. గుర్తింపు పొందిన వర్సిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణత సాధించి ఉండాలి. జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కం టైపిస్ట్, సీనియర్ క్లర్క్ కం టైపిస్ట్ పోస్టులకు టైపింగ్‌లో ప్రావీణ్యం అవసరం. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ https://www.rrbapply.gov.inలో సంప్రదించగలరు.

## మెటాలో 600 మంది ఉద్యోగుల టర్మినేషన్




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** టెక్ దిగ్గజం మెటా మరోసారి భారీ ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. కంపెనీకి చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం సూపర్ ఇంటెలిజెన్స్ ల్యాబ్స్‌లో పనిచేస్తున్న దాదాపు 600 మంది ఉద్యోగులను తొలగించే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని ఉద్యోగులకు పంపిన అంతర్గత మెమో ద్వారా వెల్లడించినట్లు తెలుస్తోంది. కంపెనీ తమ ఏఐ యూనిట్‌ను మరింత సరళంగా, వేగంగా పనిచేసే విధంగా పునర్ వ్యవస్థీకరించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

## అమెరికా కాన్సులేట్ పునఃప్రారంభం




**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** తమిళనాడులోని చెన్నైలో అమెరికా కాన్సులేట్ తన కార్యకలాపాలను పునః ప్రారంభించింది. ఈ విషయాన్ని కాన్సులేట్ 'ఎక్స్'లో పోస్టు ద్వారా వెల్లడించింది. వీసా ప్రాసెసింగ్ సేవలు గురువారం నుంచి ప్రారంభం అయ్యాయని పేర్కొంది. 22న కాన్సులేట్ మూసివేత వల్ల రద్దయిన అపాయింట్‌మెంట్లను రీషెడ్యూల్ చేస్తామని తెలిపింది.

## మత్స్యకారులను క్షేమంగా తీసుకొస్తాం



**అక్షరటుడే, అమరావతి:** పొరపాటున బంగ్లాదేశ్ సముద్ర జలాల్లో ప్రవేశించి అక్కడి నేవీ అధికారులకు చిక్కిన 8 మంది విజయనగరం జిల్లా మత్స్యకారులను క్షేమంగా స్వస్థలాలకు చేరుస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఈ విషయంపై బుధవారం రాత్రి విదేశాంగ మంత్రి జైశంకర్‌తో చర్చించినట్లు వెల్లడించారు.

## వికాసానికి, వినాశనానికి మధ్య పోరు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బీహార్ ఎన్నికలను ఎన్డీయే 'వికాసానికి', ఇండియా కూటమి 'వినాశనానికి' మధ్య జరుగుతున్న పోరుగా బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా అభివర్ణించారు. భాగస్వామ్య పక్షాలను అంతం చేసే పరాన్నజీవి పార్టీగా కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. ఆర్జేడీ.. రంగ్‌దారీ, జంగల్‌రాజ్, దాదాగిరీలకు ప్రతీక అని విమర్శించారు.


## ఆసియన్ శిఖరాగ్ర సమావేశానికి మోదీ దూరం


**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో ఈ నెల 26 నుంచి 28 వరకు జరగనున్న ఆసియన్ శిఖరాగ్ర సమావేశానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ హాజరు కావడంలేదు. షెడ్యూల్ సమస్యల కారణంగా ఆయన ఈ సదస్సులో పాల్గొనలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రధాని మోదీ - అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్య జరగనున్న భేటీ కూడా రద్దయ్యింది. ప్రధాని మోదీ వర్చువల్‌గా సదస్సులో పాల్గొనే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మోదీ స్థానంలో విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ భారత్‌కు ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు. కాగా.. మోదీ ఆసియన్ సమ్మేళనానికి వెళ్లే ముందు కంబోడియా పర్యటన కూడా ప్లాన్ చేసినప్పటికీ, ఇప్పుడు అది కూడా వాయిదా పడింది.

## డీజీపీ ఆఫీస్ ముట్టడికి బీజేపీ నేతల యత్నం



**అక్షరటుడే, హైదరాబాద్:** నగర శివారులోని పోచారం ఐటీ కారిడార్‌లో గో సంరక్షకుడు సోనూసింగ్‌పై కాల్పుల ఘటన నేపథ్యంలో బీజేపీ నేతలు ఆందోళనకు దిగారు. లక్డీకాపూర్‌లోని డీజీపీ కార్యాలయం ముట్టడికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కార్యాలయం వద్దకు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుతో పాటు పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు.





**జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఇద్దరు రాష్ట్ర నేతలకు కఠిన పరీక్షగా మారింది. కింది స్థాయి నుంచి రాష్ట్ర సారథులుగా ఎదిగిన ఆ ఇద్దరికి బై పోల్ సవాలు విసురుతోంది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, బీజేపీ రాష్ట్ర సారథి రాంచందర్ రావుకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఎంతో కీలకంగా మారింది. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత జరుగుతున్న తొలి ఎన్నికల్లో తమ పార్టీని విజయ తీరాలకు చేర్చాల్సిన బాధ్యత ఆ ఇద్దరి నాయకులపైనే పడింది. సంపన్నులతో పాటు పేద వర్గాలు మిళితమై ఉండే జూబ్లీహిల్స్ గడ్డపై విజయం సాధించి తమ సామర్థ్యాన్ని నిరూపించుకుంటారో లేక సమరంలో సత్తా చాటలేక ఓటమి మూటగట్టుకుంటారో నవంబర్ 14న తేలిపోనుంది.**

–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# వారికి సవాలే..!

- **మహేశ్ గౌడ్, రాంచందర్ రావులకు కఠిన పరీక్షగా జూబ్లీహిల్స్ ఎన్నిక**
- **పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా ఎదుర్కొనున్న తొలి ఎన్నిక**
- **నాయకత్వానికి పరీక్ష పెడుతున్న బైపోల్**

జూబ్లీహిల్స్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ హఠాన్మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక జరుగుతోంది. నవంబర్ 11న ఉప ఎన్నికలు, 14న కౌంటింగ్ నిర్వహించనున్నట్లు ఈసీ ఇటీవలే షెడ్యూల్ ప్రకటించింది. నోటిఫికేషన్ కూడా జారీ కావడంతో ప్రధాన పార్టీలతో పాటు చాలా మంది నామినేషన్లు దాఖలు చేయగా.. బుధవారం స్క్రూటినీ నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్, బీఆర్ ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, బీజేపీ నుంచి లంకల ప్రదీప్‌రెడ్డి నామినేషన్లకు రిటర్నింగ్ అధికారి ఆమోదం తెలిపారు. విజయం కోసం హోరాహోరీగా పోరాడుతున్న మూడు పార్టీలు ఇప్పటికే ప్రచారాన్ని ఉధృతం చేశాయి. సత్తా చాటేందుకు మూడు పక్షాలూ సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. అయితే, రాష్ట్రంలో ప్రస్తుతం అందరి దృష్టి ఇద్దరు నేతల మీదనే నెలకొని ఉంది. కాంగ్రెస్ రాష్ట్ర సారథి మహేశ్ గౌడ్, బీజేపీ రాష్ట్ర దళపతి రాంచందర్ రావు తమ పార్టీలను ఎలా గట్టెక్కిస్తారన్న దానిపైనే చర్చ జరుగుతోంది.

### మహేశ్ కు పరీక్షే..

పీసీసీ చీఫ్‌గా నియమితులైన బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌కు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఎంతో కీలకంగా మారింది. అధికారం పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ఎదుర్కొంటున్న తొలి ఎన్నిక ఇదే కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఎలాగైనా విజయం సాధించాలనే లక్ష్యంతో మహేశ్ గౌడ్ నేతృత్వంలో పార్టీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం పార్టీ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో దారుణమైన ఫలితాలు చవిచూసింది. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో మెజార్టీ స్థానాలు సాధించిన అధికార పార్టీ.. జీహెచ్ ఎంసీ పరిధిలో మాత్రం చతికిలపడింది. అయితే, కంటోన్మెంట్ ఉప ఎన్నికలో గెలుపొందిన కాంగ్రెస్.. జూబ్లీహిల్స్ లోనూ పాగా వేయడం ద్వారా నగర పరిధిలో బలం పెంచుకోవాలని యోచిస్తోంది. అందులో భాగంగానే మహేశ్ గౌడ్ నేతృత్వంలోని అధికార పార్టీ.. తాజా ఉప ఎన్నికలో గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తోంది. ఇక్కడ విజయం సాధించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత లేదని చాటుకోవడంతో పాటు మహేశ్ గౌడ్ తన నాయకత్వ సామర్థ్యాన్ని నిరూపించుకునే అవకాశం లభించినట్లవుతుంది.

### రాంచందర్ రావుకు సవాలే..

తెలంగాణలో అధికారం చేపట్టాలన్న లక్ష్యంతో పోరాడుతున్న బీజేపీకి కూడా జూబ్లీహిల్స్ బై పోల్ కఠిన పరీక్ష పెడుతోంది. అందులోనూ ఇటీవలే రాష్ట్ర పార్టీ బాధ్యతలు చేపట్టిన రాంచందర్ రావు తన సత్తాను నిరూపించుకునేందుకు ఇది కీలకంగా మారింది. మహా నగరంలో బలంగా ఉన్న కాషాయ పార్టీకి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఊహించని రీతిలో షాక్ ఇచ్చాయి. ఎప్పటిలాగే గోషామహల్‌లో కాషాయ జెండా రెపరెపలాడగా, మిగతా చోట్ల దారుణంగా ఓడిపోయింది. అయితే, లోక్ సభ సమరంలో సికింద్రాబాద్, మల్కాజిగిరి స్థానాల్లో విజయం సాధించి తన బలాన్ని మరోసారి నిరూపించుకుంది. ఈ నేపథ్యంలో ఇటీవల పార్టీ పగ్గాలు చేపట్టిన రాంచందర్‌రావు బీజేపీని ఎలా విజయ తీరాలకు చేర్చుతారన్న దానిపై అందరి దృష్టి నెలకొంది.

## జూబ్లీహిల్స్ బరిలో మిగిలింది 81 మందే..

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు భారీగా నామినేషన్లు దాఖలైన విషయం తెలిసిందే. మొత్తం 211 మంది అభ్యర్థులు 321 నామినేషన్లు స్వీకరించారు. అయితే ఇందులో 186 నామినేషన్లు రిజెక్ట్ అయ్యాయి. ఎన్నికల అధికారులు బుధవారం నామినేషన్ల పరిశీలన చేపట్టారు. ఎక్కువ మొత్తంలో నామినేషన్లు రావడంతో రాత్రి వరకు ప్రక్రియ సాగింది. క్షుణ్ణంగా పరిశీలించి సక్రమంగా లేని వాటిని రిజెక్ట్ చేశారు. 17 గంటల పాటు జరిగిన వడపోత అనంతరం 186 నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. 135 నామినేషన్లను ఓకే చేశారు. దీంతో ప్రస్తుతం 81 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

## బీఆర్ఎస్ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం



**అక్షరటుడే, హైదరాబాద్:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవల్లిలో పలువురు పార్టీ నేతలతో సమావేశమయ్యారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకరావు, సునీతా లక్ష్మారెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కీలక నేతలు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై కేసీఆర్ వారితో చర్చించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో నెలకొన్న పరిణామాలు, చేరికలు, ప్రచార శైలి తదితర అంశాలు చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఎన్నిక గడువు సమీపిస్తుండడంతో ప్రచారంలో వేగం పెంచాలని వారికి దిశానిర్దేశం చేశారు.

## ఇంటి పేరు మార్చుకున్న హన్సిక..



**హిందీలో బాలనటిగా తన కెరీర్ ప్రారంభించిన హన్సిక మోత్వానీ.. తెలుగులో "దేశముదురు" సినిమాతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ తర్వాత హిందీ, కన్నడ, తమిళ భాషలలో కూడా నటించిన హన్సిక, తన ప్రతిభతో ప్రేక్షకుల మన్ననలు పొందింది. అయితే తన స్నేహితురాలి మాజీ భర్త, వ్యాపారవేత్త సోహైల్ ఖతురియాతో ప్రేమలో పడిన హన్సిక 2022లో వివాహం చేసుకుంది. వివాహం జరిగి మూడేళ్లు కూడా పూర్తి కాకముందే ఖతురియాతో మనస్పర్ధల వలన విడాకులు తీసుకుందని కొద్ది రోజులుగా వార్తలు నెట్టింట హల్‌చల్ చేస్తు న్నాయి. హన్సిక తన భర్తతో దిగిన ఫొటోలను సోషల్ మీడియా నుండి డిలీట్ చేసింది. సడెన్‌గా తన ఇంటి పేరును కూడా మార్చింది. ఇంగ్లిష్‌లో "Motwani"గా మార్చింది. కొంతమంది న్యూమరాలజీ ప్రకారం పేరు మార్చినట్టు ఉండవచ్చని భావిస్తున్నారు. ఇంకొందరు దీనిని కూడా విడాకులకు లింకప్ చేస్తున్నారు.**

- అక్షరటుడే, సినిమా డెస్క్

## ఢిల్లీలో భారీ ఎన్‌కౌంటర్..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశ రాజధాని ఢిల్లీలో భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఘటనలో అనేక కేసుల్లో నిందితులుగా ఉన్న సిగ్మా గ్యాంగ్ సభ్యులు నలుగురు మృతి చెందారు. ఢిల్లీలోని రోహిణి ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఇందులో బీహార్‌కు చెందిన నలుగురు సిగ్మా గ్యాంగ్ సభ్యులు హతమయ్యారు. ఈ గ్యాంగ్ కొంతకాలంగా బీహార్‌లో నేరాలకు పాల్పడుతోంది. గ్యాంగ్ కీలక సభ్యుడు రంజన్ పాఠక్ (25)తో పాటు సభ్యులు బిమ్లేష్ మహతో (25), మనీష్ పాఠక్ (33) అమన్ ఠాకూర్ (21) మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. ఢిల్లీ పోలీస్ క్రైమ్ బ్రాంచ్ బీహార్ పోలీసుల జాయింట్ ఆపరేషన్ చేపట్టి నిందితులను ఎన్‌కౌంటర్ చేశారు. వీరిలో అమన్ ఠాకూర్ ఢిల్లీలోని కార్వాల్ నగర్ నివాసి కాగా, మిగిలిన వారు బీహార్‌లోని సీతామర్హికి చెందినవారు.

## మహాగఠ్‌బంధన్ సీఎం అభ్యర్థిగా తేజస్వీ యాదవ్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో విపక్ష కూటమి తన సీఎం అభ్యర్థిని ప్రకటించింది. కాంగ్రెస్, ఆర్జేడీ, ఇతర పార్టీలు కలిపి బీహార్‌లో మహాగఠ్‌బంధన్ కూటమి పేరిట పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా తమ సీఎం అభ్యర్థిగా ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ పేరును కూటమి నేతలు ప్రకటించారు. వికాస్‌షీల్ ఇన్సాన్ పార్టీకి చెందిన ముఖేష్ సహానీ ఉప ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఉంటారని తెలిపారు. కాగా.. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు రెండు దశలుగా నవంబర్ 6, 11వ తేదీల్లో జరగనున్నాయి.

## సీఎంపై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు



**అక్షరటుడే, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కమీషన్ల కోసం మంత్రులు కొట్లాడుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అగ్రికల్చర్ పోయి.. గన్ కల్చర్ వచ్చిందన్నారు. తెలంగాణ భవన్‌లో గురువారం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ తెలంగాణ ప్రతిష్టను దెబ్బతీస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో గన్ కల్చర్ వచ్చిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తుపాకీ ఇచ్చారని స్వయంగా మంత్రి కొండా సురేఖ కూతురు చెప్పారని గుర్తు చేశారు. మరోవైపు పోలీసులు ఏమో కొండా మురళి తుపాకీ ఇస్తే సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ బెదించాడని అంటున్నారని చెప్పారు. అయితే బెదిరించిన మాట వాస్తవమే కదా అని ఆయన అన్నారు. నిందితుడిని స్వయంగా మంత్రి తీసుకుపోతుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి ఎందుకు తొలగించలేదన్నారు.

### భయపడుతున్న అధికారులు

సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో అధికారులు భయపడుతున్నారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ నేతలు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. మంత్రుల తీరుతో ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వీ పదేళ్ల సర్వీస్ ఉండగా.. వీఆర్ఎస్ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. మంత్రులు చేసే తప్పులకు బలి కావొద్దని కేటీఆర్ అధికారులకు సూచించారు. కాంగ్రెస్ అరాచకాలకు వత్తాసు పలికితే తప్పకుండా శిక్ష పడుతుందని ఆయన హెచ్చరించారు.